# లెక్కలురాని బుద్ధిమంతులు . . . .

అడపా రామకృష్ణరావు

నా చిన్నతనంలో మా రంగమ్మత్తయ్య చెంపలు రెండూ నొక్కిపెడుతూ "రామకృష్ణరావు— లెక్కలురావు" అని రాగతాళయుక్తంగా దీర్ఘాలుతీస్తూ వన్నెగోళి చేస్తూవుండేది. పాపం— నాకేడేళ్ళయినా నిండకముందే ఆ అత్తయ్య చనిపోయింది. కాని ఆమె నోటిచలువచేత ఈ అల్లుడికి లెక్కలు మాత్రం అప్పటికీ ఇప్పటికీ రాకుండానే పోయినై.

అదే దిగులుగా వుండేది చాలా కాలం—ఇక మనకు ఈ జన్మలో లెక్కలు రావు కదా అని. ఐతే అదృష్టంపండి ఇటీవల నేను కొన్ని కొన్ని గ్రంధాలు—ముఖ్యంగా మహామహుల జీవిత విశేషాలు పఠించడం తటస్థించింది. ఆ వూపుతో మనసులో పాతుకుపోయిన సంకోచం కాస్తా కరిగి ఆవిరై యెగిరిపోయింది. లెక్కలు రావని విచారించడం యెంత విచారింపదగ్గ విషయమో తేలిపోయింది.

ఏమిటని అడగండి. ఈ ప్రపంచపు గడ్డమీద పుట్టి కాస్త మెదడుండి స్వతంత్రంగా—మరచక్రాల మాదిరి కాకుండా—యోచించ గలిగిన ఏ ఒక్కరికీ లెక్కలు చెయ్యడం చేతకాదని ఆ పుస్తకాల్లో చదివాను. అనుమానమా?

జాన్సన్ విషయం తీసుకోండి. లెక్కలు రాక యెంతో అవస్థపడ్డాడుట జాన్సన్. అతడికి గణిత శాస్త్రంపట్ల గల అభిమానం వెల్లడించడానికి ఒక్క ఉదాహరణం చాలనుకుంటాను: ఒకమాటు వాళ్ళ నాన్నకు ఉత్తరం వ్రాస్తూ చివర "జాలి పడదగిన లెక్కలురాని మీకుమారుడు" అని ముగించి సంతకం చేశాడుట.

లెక్కలురాని ఈ జాన్సనే ఇంగ్లీషు భాషకు మొట్టమొదటి డిక్షనరీని కూర్చి; తరువాత పుట్టిన నిఘంటుకారులందరికీ భిక్షపెట్టి ఆనాటి "వాఙ్మయ నియంత" (Dictator of english literature) అన్న నిరంకుశ గౌరవానికి నోచుకున్నాడని [illegible]రించుకోండి.

ఈ జాన్సన్ మహాశయునికి అసలు సిసలైన స్నేహితుడు ఆలివర్ గోల్డ్‌స్మిత్. మనిషి చూపరి, మాట నేర్పరి కాకపోయినా అద్భుతమైన శైలిలో కలం నడిపాడు. ఇంగ్లీషు వాఙ్మయంలో మొట్టమొదట చెప్పుకోదగ్గ గొప్పనవల "వికార్ ఆఫ్ వేక్ ఫీల్డు" ఇతడు వ్రాసిందే.

గోల్డుస్మిత్‌కీ లెక్కలు రావు. లెక్కలమీద కోపం పట్టలేక ఒకానొక రచనలో తెగించి దుమ్మెత్తి పోశాడు కూడాను.

వీళ్ళంతాచేరి జాన్సన్ అధ్యక్షతకింద "లిటరరీక్లబ్" స్థాపించారు. ఆనాటి ఇంగ్లీషు సాహిత్యపు దిగ్దంతులందరూ అందులో సభ్యులు కాని వాళ్ళలో ఏ ఒక్కరికీ గణితశాస్త్రంలో అభిరుచి లేదట.

దూర తీరాలవాళ్ళు పోనీండి, మనవాళ్ళనే చూద్దాం. అమెరికా వెళ్ళి షికాగో నగరంలో జరిగిన ప్రపంచమత మహాసభలో హిందూ మతానికి ప్రతినిధిగా నిలబడి, తన అనర్గళ వాగ్ధోరణితో పాశ్చాత్యదేశస్థులందరినీ హడలగొట్టి వచ్చిన వివేకానందస్వామి జీవితచరిత్ర చదివారా? ఆయన చదువులో సానపట్టిన రత్నమట. సంస్కృతం, బెంగాలీ, ఇంగ్లీషు అన్నీ కంఠగతమేనట. కాని—లెక్కలలో నే సున్న!

తన కవితా మధురిమతో విశ్వమంతటినీ వసంతోద్యాన వాటికగా చిగురింపజేసిన మహాకవి రవీంద్రునికీ లెక్కలురావట. చాలా అవస్థపెట్టేవాడుట బడిపంతులు. ఈ బాధ పడలేక తను రోజూ బడికి వెళ్ళేటప్పుడు బూట్లను చన్నీళ్లలో ముంచి తొడుగుకుని వెళ్ళేవాడట. ఎందుకనుకున్నారు? తడిసిన బూట్లు తొడుక్కుంటే తప్పకుండా జ్వరం వస్తుంది—తాత్కాలికంగానైనా పంతులు దెబ్బలు తప్పిపోతాయి అనిట పాపం!

ఒకసారి రవీంద్రుని తండ్రి మహర్షి దేవేంద్రనాథఠాకూర్ ఆయనకు కొంత డబ్బు చేతికిచ్చి,

ఖర్చు చేసుకుని జమాఖర్చూ వ్రాసి అట్టే పెట్టమని చెప్పారట. సరే, ఆయన ఖర్చుచేశాడు, లెక్క వ్రాశాడు. దేవేంద్రనాథు డొకరోజున ఆ లెక్క తణిఖీచేశారట. అందులో ఇచ్చిన సొమ్ములో ఖర్చుచేసిన సొమ్ము తీసివెయ్యగా మిగిలిన శేషం అసలు ఇచ్చిన దానికంటె హెచ్చుగా వుందట. మహర్షి నవ్వి "బ్యాంకుల్లో దాచడంకన్న డబ్బు నీచేతికిస్తే దబ్బున పెరుగుతుందల్లే వుందే" అని ఎగతాళి చేశారట.

గాంధీజీ విషయం వినండి. ఆయనకు చిన్నతనంలో స్వయంగా లెక్కలుచేసే తెలివి తేటలూ లేవట. ఎదుటివాడి పలకలోనుంచి నకలుతీసే నైపుణ్యమూ లేదట. ఒకమాటు వాళ్ళ స్కూలుకి ఇన్‌స్పెక్టర్ వచ్చినప్పుడు తోటిపిల్లలంతా ఏదో ఒకవిధంగా ఆన్సర్స్‌వేసి చూపెడితే, ఈయన ఒక్కడూ కాకుల్లో కోకిలలాగ చేతకాక నిలబడ్డాడుట. ఇన్‌స్పెక్టర్ వెళ్ళిపోయాక వాళ్ళ మాస్టరు దగ్గరకు పిలిచి "లెక్క చెయ్యలేకపోతే పోనీ—ప్రక్కవాడి పలకలోనుంచైనా ఎక్కించవద్దా?" అని లెంపకాయ కొట్టాడట.

కాబట్టి లెక్కలురావని బెంగపడటం పురుష లక్షణం కాదు. అసలు లెక్కలు చేతకావడమే పురుష లక్షణంకాదు. ధనుర్మాసంలో తెల్లవారేటప్పటికల్లా వీధిలో సాక్షాత్కరించే టటువంటి ఆ చుక్కలూ, ఆ ముగ్గులూ మనకు చేతకాకపోతే ఫరవాలేదు. ఎవరో చెప్పినట్టు ఈ లెక్కల రాయుళ్ళంతా క్రిందటి జన్మంలో ఆడవాళ్ళయి అందులో ఆర్య హిందూమహిళలై వుంటారు. ఆ పూర్వజన్మ వాసనచేతనే ఇంకా కాగితాలమీద ముగ్గులు గిలుగుతూ వుంటారు. లేకుంటే వచ్చే జన్మంలోనైనా వీళ్ళు రవికలు తొడుగుకోక తప్పదు.


ఇళ్ళన్నీ కేవలం
టి. టి. ఇంగువమయం
సైన్సుపికె
టి. టి
మిక్సుకి యింగువ


# ఇంతా చేస్తే!

"కాళీపట్నం"

యావదాంధ్ర విఖ్యాత రచయిత—యే పదవ ఏటనో పుస్తకం పట్టాడు. రాత్రీ పగలూ చదివాడు. క్లాసు పుస్తకాలు సంగతి మరిచిపొయ్యేవాడు.

ఇంట్లో తండ్రిచేత బయట మాస్టరుగారుచేత తిట్లు సహించాడు విద్యార్థి జీవితమల్లా.

ఇంట్లో భార్యనుంచీ బయట అధికార్లనుంచీ సణుగుడు సహించాడు యవ్వన జీవితమల్లా.

సాధనకు తనయెత్తు కాగితాలు వ్రాశాడు. వీధి పోయే ప్రతి మనిషినీ, వినపడ్డ ప్రతి పలుకునీ, అగపడ్డ ప్రతి దృశ్యాన్నీ, మాట్లాడే ప్రతి హృదయాన్నీ, విమర్శించి, జీర్ణించుకున్నాడు. యెంతో విలువైన ఎనర్జీని నిర్లక్ష్యంగా త్యాగంచేసిన మానవ హృదయాలను అర్థంచేసుకొనే శక్తిసంపాదించాడు.

ఉత్కృష్ట మనదగ్గ గ్రంథం వ్రాశాడు.

దగ్గర దగ్గర పదహారు వందలకోట్ల మానవులలో, రెండుకోట్ల అరవైనాలుగు లక్షలే అయిన ఆంధ్రులలో, పదహారు లక్షల అక్షరాస్యులలో, పుస్తకాలు చదివే అవకాసమున్న లక్షమందిలో యాభైవేల మంది చదివారు ఆ పుస్తకాన్ని.

పదహారుకోట్లమంది జనసంఖ్యలో ఎన్నవవంతు? మూడులక్షల ఇరవై వేలమంది మనుష్యులకు ఒక్కడి వంతుననీ పుస్తకం అందుకున్నారు.

కాని అంత గొప్ప పుస్తకాన్ని అందరూ ఆనందించలేరు.

రవీంద్రుడి పశ్చాత్తాపం బోరింగ్‌గా వుందన్న నవలా పాఠకుణ్ణి నే నెరుగుదును. ఆయన చదివేది రైల్వే సారస్వతం.

అంచనాకు వెయ్యిమంది ఆనందించగలరేమో. ఆ పుస్తకాన్ని.

వారైనా వారి జీవితం నూరేండ్లలో ఆ పుస్తకం చదివిన రెండు మూడు గంటలు మాత్రం కరిగి చలించి రచయితను మెచ్చుకోగలుగుతారు.

జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఒక సెకన్ వేసుకున్నా జీవితమంతటా యింకో గంట వేసుకోవచ్చు. మొత్తం నాలుగు గంటలు.

జీవితమల్లా ఎంతో త్యాగంచేసి కష్టపడి సాధన చేసి చేసి వ్రాసిన రచన—

ప్రపంచంలో—కష్టంమీద కోటిక్కొకణ్ణి రెండు లక్షల గంటలకు ఒకగంట మాత్రం చలింప చెయ్యగలుగుతుందట!